సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.461 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 30.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,209 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,506
3శాతం జీఎస్టీతో	రూ.5,671
నవర (8గ్రా)	రూ.45,368

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /27.5

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 65 శాతం ఉంది. మంగళవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగాలు, పార్ట్‌టైం జాబ్స్‌తో రెట్టింపు నగదు సంపాదించవచ్చని ఆశచూపి లక్షలు కాజేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు. సోమవారం స్థానిక ఉమేష్‌చంద్రా మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 104 మంది పాల్గొని తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వాటిని నిశితంగా పరిశీలించిన ఎస్పీ ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మోసానికి గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన ఫలితం ఉంటుందన్నారు. దంపతుల విభేదాల్లో తొందరపడి కేసులు నమోదు చేయరాదని, కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాలను చక్కదిద్దాలన్నారు. అనంతరం ఫిర్యాదుదారులకు ఉచిత భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంజన సింహ, ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలను ఉపేక్షించం

• భూ హక్కు– భూరక్షపై జేసీ



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ హక్కు– భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీ సర్వేలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, ఇతర అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు వచ్చే అర్జీల్లో నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. సమగ్రంగా, పటిష్టంగా రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ వెంట సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అన్నలూరు హనుమాన్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

మర్రిపాడు: పొగాకు ధరలు వివిధ దేశాలలో ఆ పంట సాగు, దిగుబడి, నాణ్యత ఇలా అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. అందుకే పొగాకు ధరలు స్థిరమైన ఆదాయ వనరులుగా పరిగణించకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. సోమవారం డీసీపల్లి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పొదలకూరు శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివజ్యోతి, మర్రిపాడు వ్యవసాయాధికారి రామ్మోహన్, డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు మాట్లాడుతూ పొగాకు పంటను బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు మర్రిపాడులో జగనన్నకు చెబుదాం

మర్రిపాడు: మర్రిపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ నెల 18వ తేదీ బుధవారం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఆనందరావు, ఎంపీడీఓ నాగమణిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్, జిల్లాస్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వామికే శఠగోపం!

పెంచలకోన శ్రీలక్ష్మీనరసింహ స్వామికి భూములు రాసిచ్చిన దాత

- 1942లోనే ట్రస్ట్ డీడ్ ద్వారా దేవస్థానానికి ఆస్తుల బదలాయింపు
- ఆరేళ్ల క్రితం నెల్లూరులో ఆస్తులున్నట్లు గుర్తించిన ఆలయ అధికారులు
- మూడేళ్ల క్రితం వెలుగుచూసిన రూ.కోట్ల విలువైన ట్రస్ట్ డీడ్ పత్రాలు
- నిషేధిత జాబితాలో ఉంచి చేతులు దులుపుకున్న అధికారులు
- విలువైన భూములు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న కబ్జాదారులు

ఆలయాల ఆస్తుల పరిరక్షణ విషయంలో దేవదాయశాఖ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. నగర బొడ్డున దాదాపు రూ.500 కోట్ల విలువ చేసే ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు ఖరీదైన భూములను కబ్జా చేసి భారీ భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు.



నెల్లూరు మినీ బైపాస్‌రోడ్‌లో టీడీపీ కార్యాలయం సమీపంలో ఆక్రమణ స్థలంలో నిర్మించిన షెడ్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాపూరుకు చెందిన కోట నరసయ్య శెట్టి నెల్లూరు రంగనాయకులపేటలో 184 అంకణాల స్థలాన్ని, నగర నడిబొడ్డున ఉన్న మినీబైపాస్ అనుకుని 10.02 ఎకరాలు, ఇందుకూరుపేట పోతురాజుదిబ్బ గ్రామంలో 11.35 ఎకరాల వ్యవసాయ భూమిపై వచ్చే ఆదాయాన్ని రాపూరు మండలం పెంచలకోన నరసింహస్వామి దేవస్థానంలో కార్యక్రమాల నిర్వహణకు వినియోగించాలని 1942లో ట్రస్టు డీడ్ రాశారు. ఆయన కోరిక మేరకు స్వామివారి జయంతి వేడుకల్లో దాత గృహం వద్ద ప్రతి నిత్యం ఐదుగురు బ్రాహ్మణులకు, ఇతరులకు అన్నదానం నిర్వహించాలి. ఆయనకు సంతానం లేకపోవడంతో అన్న కుమారుడిని ట్రస్టీగా పెట్టి సదరు ఆస్తులపై వచ్చే ఆదాయంతో పై కార్యక్రమాలను నిర్వహించిన తదుపరి వారసులుగా మిగతా ఆదాయాన్ని అనుభవించే హక్కును కల్పించారు. ఆస్తులను విక్రయించే హక్కులను మాత్రం ఇవ్వలేదు.

• ట్రస్ట్ డీడ్ ఉన్న విషయం 2018 వరకు దేవదాయశాఖకు సమాచారం లేకుండా దాత కుటుంబీకులు గుట్టు చప్పుడు కాకుండా ఆస్తులను విక్రయించుకున్నారు. 2018లో వెలుగు చూసిన డీడ్ ప్రకారం దేవదాయశాఖ విచారణ చేసి శాఖకు ఆ భూములు, స్థలాలు చెందుతాయని నిర్ధారించి శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అనుబంధంగా కోట నరసయ్యశెట్టి స్పెసిఫిక్ ఎండోమెంట్ (నిర్దిష్ట ధర్మదాయం) పరిధిలోకి బదలాయించి ఆస్తుల క్రయ విక్రయాలను నిషేధిస్తూ 22 ఏ (సీ) జాబితాలోకి చేర్చారు. ఈ తంతు జరిగి ఆరేళ్లు పూర్తయినా సదరు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్పా ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొని సంరక్షణ బాధ్యతలు చేపట్టలేదు. రంగనాయకుల పేటలో విలువైన స్థలాన్ని కబ్జా చేస్తున్నా చర్యలు లేవు. తాజాగా మినీబైపాస్ ఆనుకుని టీడీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న కోట్ల విలువ చేసే భూములు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. ఇంకా దురాక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అంకణం విలువ దాదాపు రూ.10 లక్షలు ధర పలుకుతోంది. ఇప్పటికే అక్కడ విలువైన భూములను ఆక్రమణ చేసి అక్రమార్కులు విక్రయాలు చేశారు. అది నగర నడిబొడ్డు కావడంతో అన్యాక్రాంతమైన భూముల్లో భారీ భవంతులు వెలిశాయి. టీడీపీ కార్యాలయం పరిధి కూడా దేవదాయ ఆస్తుల కిందకే వస్తుంది. కానీ గతంలో ఆ భూములను ట్రస్ట్ డీడ్ వెలుగులోకి



రాకముందే విక్రయాలు జరగడంతో పార్టీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకున్నారు. టీడీపీ కార్యాలయమే కాదు దాదాపు ఆ పరిసర ప్రాంతాల్లో 10 ఎకరాలకు పైగా ఆస్తులను ఇప్పటికే దాత కుటుంబీకులు విక్రయాలు చేసుకుని సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం ఆ భూములు నాలుగు చేతులు కూడా మారాయి. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూములను కూడా దేవదాయశాఖ పరిరక్షించుకోవాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం



దేవదాయశాఖ ఆస్తుల ఆక్రమణలపై నూతన జీవో ప్రకారం నోటీసులు ఇస్తాం. ఆక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. నెల్లూరులో పెంచలకోన శ్రీ లక్ష్మీనరసంహ స్వామి దేవస్థానంకు సంబంధించిన ఆస్తులను కాపాడేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాం.

– ఎం.హరినారాయణన్, కలెక్టర్, నెల్లూరు

నేటి అలంకారం



నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరీ ఆలయంలోని అమ్మవారు మంగళవారం భక్తులకు గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిస్తారు.

సెలవుల్లో తరగతులు వద్దు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దసరా సెలవుల్లో తరగతులను నిర్వహిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా మండల, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



నెల్లూరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా రెండో రోజు భవాని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



రాజరాజేశ్వరి అమ్మవారికి సోమవారం పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

తప్పు చేసిన వారికి సంకెళ్లు తప్పవు

- మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి
- ముత్తుకూరులో పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

ముత్తుకూరు: టీడీపీ శ్రేణులు చేతులకు సంకెళ్లు వేసుకొని తిరుగుతున్నారని, తప్పు చేసిన వారెవరికైనా సంకెళ్లు తప్పవని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఎద్దేవా చేశారు. ముత్తుకూరులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయ నూతన భవనాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 100 మందికి పార్టీ కండువాలు కప్పి, స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ అన్ని కోణాల్లో విచారించి సాక్ష్యాధారాలతో సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందని గుర్తు చేశారు. దీంతో టీడీపీ నాయకులు ఫ్రస్టేషన్‌లోకి వెళ్లిపోయారని, రెచ్చిపోయి న్యాయ వ్యవస్థపైనే



ముత్తుకూరులో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి

దాడికి పూనుకొన్నారని, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మంత్రి కాకాణి మండిపడ్డారు. రూ.వేల కోట్లు దోచుకొన్న చంద్రబాబుకు శిక్ష వేయకూడదని ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ న్యాయవాదులపై దాడికి పాల్పడుతున్నారని, న్యాయమూర్తులపై అసభ్యకరమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. చంద్రబాబును వదిలిపెట్టకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేస్తామన్న సంకేతాలిస్తున్నారని విచారం వెలిబుచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలన్న దుర్మార్గమైన ఆలోచన చేయడం మంచిది కాదన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవంతంగా పెన్షన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నారని సాక్షాత్తు తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రశంసించారని మంత్రి కాకాణి గుర్తు చేశారు. పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుంబాక శేషారెడ్డి, మునుకూరు జనార్ధనరెడ్డి, పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, కే లక్ష్మణరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

• అధికారులకు జేసీ కూర్మనాథ్ ఆదేశం

నెల్లూరు (దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి అందే అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా సకాలంలో పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జేసీ కూర్మనాథ్, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సంబంధిత శాఖల జిల్లా అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో వచ్చిన అర్జీలే మళ్లీ వస్తున్నాయని, అలాంటి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అర్జీదారులను పిలిపించి పరిష్కారం చేయగలిగినవి చేయాలని, లేనిపక్షంలో ఎందువలన పరిష్కారం చేయలేకపోతున్నామో స్పష్టంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, ఐసీడీఎస్ పీడీలు రవీంద్ర, హేనా సుజన్, హౌసింగ్ పీడీ నాగరాజు, బీసీ, మైనారిటీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వెంకటయ్య, నిర్మలాదేవి, రమేష్, పరిమళ, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ ఎస్ రమేష్‌నాథ్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు



జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

పుంజుకుంటున్న రవాణా శాఖ రాబడి

- 2022–23 ఆర్థిక ఏడాదిలో లక్ష్యం రూ.319.41 కోట్లు
- సాధించింది రూ.216.84 కోట్లు
- ఈ ఏడాది లక్ష్యం రూ.360.53 కోట్లు
- సెప్టెంబరు వరకు రాబడి రూ.180 కోట్లు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో మాత్రం 120 శాతం లక్ష్యసాధన
- నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు (టౌన్): కరోనా తరువాత పూర్తిగా తగ్గిపోయిన రవాణా శాఖ రాబడి ప్రస్తుతం పుంజుకుంటోంది. ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించే పనిలో జిల్లా రవాణాశాఖ శ్రమిస్తోంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో జిల్లా రవాణా శాఖకు రూ.229.95 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే కరోనా నేపథ్యంలో కేవలం రూ.26.12 కోట్ల మేరకు మాత్రమే సాధించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.319.41 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే రూ.216.84 కోట్లు సాధించారు. అంటే 67.88 శాతం లక్ష్యానికి చేరుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రవాణా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు వరకు వివిధ విభాగాల నుంచి రూ.117.42 కోట్ల రెవెన్యూను సాధించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న డీటీసీ చందర్, ఎంవీఐ, ఏఎంవీఐలు (ఫైల్)

ఎన్‌ఫోర్స్‌మెంట్ దూకుడు

రాష్ట్ర రవాణాశాఖ నిర్దేశించిన లక్ష్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో జిల్లా రవాణాశాఖ అధికారులు దూసుకుపోతున్నారు. జిల్లాలో మొత్తం 9 మంది ఎంవీఐలు, నలుగురు ఏఎంవీఐలు ఉన్నారు. ఇంకా జిల్లా వ్యాప్తంగా 9 ఏఎంవీఐ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఎంవీఐకు సంవత్సరానికి రూ.9 లక్షలు, ఏఎంవీఐకు రూ.13 లక్షలు, స్క్వాడ్‌లో ఉన్న ఏఎంవీఐలకు రూ.15 లక్షల రెవెన్యూను లక్ష్యంగా నిర్దేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నిర్దేశించిన లక్ష్యం కంటే అదనంగా అదనంగా సాధించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 120.89 శాతం, ఈ సంవత్సరంలో సెప్టెంబరు వరకు 116.72 శాతం లక్ష్యాన్ని అధిగమించారు. కేవలం వాహనాలను తనిఖీ చేసి నిబంధనలను అతిక్రమించిన వాటిపై కేసులు నమోదు చేసి వాటి ద్వారా ఆదాయాన్ని సమకూరుస్తారు. 2022–23లో 20,044 కేసులు నమోదు చేయగా ఈ ఏడాది సెప్టెంబరు వరకు 7,818 కేసులను నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

తగ్గిన లైఫ్ టాక్స్‌లు

రవాణా వాహనాలు కొనుగోలు అంత ఆశాజనకంగా లేదని అధికారులు తెలుపుతున్నారు. జిల్లా వాసులు ఎక్కువగా హైదరాబాదు, చెన్నై, బెంగళూరుల్లో వ్యాపారాలు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాటు ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తూ ఆ ప్రాంతాల్లోనే నాన్ ట్రాన్స్‌పోర్ట్ (కార్లు, బైకులు) కొనుగోలు చేస్తున్నారు. ఆ వాహనాలకు సంబంధించి లైఫ్‌టాక్స్ ఆ రాష్ట్రానికే పోతోంది.

ఎంత లక్ష్యాన్ని సాధించారంటే

రవాణాశాఖకు లైఫ్‌టాక్స్, త్రైమాసిక పన్ను, చలానాలు, సర్వీసు చార్జీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర వాటి వల్ల ఆదాయం చేకూరుతుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏ విభాగంలో ఎంత ఆదాయం వచ్చిందో ఒకసారి పరిశీలిస్తే...

విభాగం	టార్గెట్	సాధించింది (రూ.కోట్లలో)
క్వార్టర్ టాక్స్	84.93	41.83
లైఫ్ టాక్స్	185.26	135.47
చలానాలు	25.23	15.85
సర్వీసు చార్జీలు	7.41	3.67
ఎన్‌ఫోర్స్‌మెంట్	16.57	20.02

ఈ ఆర్థిక సంవత్సరంలో

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రవాణాశాఖ ఉన్నతాధికారులు జిల్లా శాఖకు రూ.360.53 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.180.26 కోట్లు నిర్దేశించగా రూ.117.42 కోట్ల లక్ష్యాన్ని సాధించారు. అంటే 65.14 శాతం లక్ష్యాన్ని సాధించారు. విభాగాల వారీగా పరిశీలిస్తే..

విభాగం	టార్గెట్	సాధించింది (రూ.కోట్లలో)
క్వార్టర్ టాక్స్	37	24.97
లైఫ్‌టాక్స్	118.12	72.35
చలానాలు	13.08	7.75
సర్వీసుఛార్జీలు	3.03	1.80
ఎన్‌ఫోర్స్‌మెంట్	9.02	10.53

లక్ష్యాన్ని అధిగమిస్తాం

రాష్ట్ర రవాణాశాఖ నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తాం. పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో నిర్దేశించిన లక్ష్యం కంటే అదనం 20 శాతం అధిగమించాం. రానున్న రోజుల్లో కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి ఎక్కువ రెవెన్యూ వచ్చే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం.

– బి.చందర్, ఉప రవాణా కమిషనర్

క్లుప్తంగా

21 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులకు వ్యతిరేకంగా న్యాయవాదులు ఈ నెల 21 వరకు విధులను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. విధులను బహిష్కరించాలనే అంశమై ఈ సందర్భంగా ఏకగ్రీవంగా తీర్మానించారు. న్యాయవాదులతో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించి, తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నామని చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



సంగం: లారీ ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన సంగం చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. సంగానికి చెందిన దళిత మహాసభ జిల్లా నేత అన్వర్‌బాషా టీవీఎస్ ఎక్సెల్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి వైద్యచికిత్సకు సాయం

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్సను అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. 'పసిపాపకు పెద్ద కష్టం' శీర్షికన సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. కరేడు పల్లెపాళేనికి చెందిన ఏడాది వయస్సున్న బాలిక మాకా శ్రావ్య న్యూరోలాజికల్ డిజార్డర్‌తో విజయవాడలోని రెయిన్‌బో వైద్యశాలలో చికిత్స పొందుతోంది. చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ఉలవపాడులోని శ్రీసాయి ఒలింపియాడ్ స్కూల్ యాజమాన్యం కేశవరపు జాలిరెడ్డి, వెంకటశేషమ్మ రూ.30 వేలను అందించారు. అమెరికా నుంచి డాక్టర్ నాగఉదయ్‌కిరణ్ పిల్లల వైద్య నిపుణుడు సతీష్‌బాబు ద్వారా రూ.30 వేలను అందజేశారు. ఫోన్‌పే ద్వారా సుమారు 150 మంది దాతలు నగదును పంపారు. సుమారు రూ.1.8 లక్షల మేర అందాయని తండ్రి సురేష్ తెలిపారు.

ఈవీఎంల తనిఖీ ప్రారంభం

నెల్లూరు రూరల్: నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎంల గోదాము వద్ద మొదటి దశ తనిఖీలను జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ సోమవారం ప్రారంభించారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో కొత్త ఈవీఎంలను ఇటీవల సరఫరా చేశారు. కంపెనీ నిపుణులతో కలిసి వచ్చే నెల పది వరకు వీటిని క్షుణ్ణంగా పరిశీలించనున్నామని అధికార వర్గాలు తెలిపాయి. గోదాము నోడల్ అధికారి సుధాకర్‌తో కలిసి వీటి పనితీరును తెలుసుకున్నారు. ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

బాబు బరువు తగ్గారంటూ డ్రామాలు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

• ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: జైల్లో చంద్రబాబు బరువు తగ్గారంటూ ఆయన భార్య, కోడలు, కుమారుడు, సీనియర్ నేతలు డ్రామాలాడుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని రేగడిచెలికలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జైలుకెళ్లాక ఆయన కిలో బరువు పెరిగారని తెలిపారు. ఏదో ఒక నెపంతో చంద్రబాబును జైలు నుంచి బయటకు తీసుకెళ్లి వారి వర్గానికి చెందిన హాస్పిటల్లో ఉంచాలనే ఉద్దేశంతో కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. బాబు కుటుంబసభ్యులు, ఆ పార్టీ నేతలు ఎన్ని నాటకాలాడినా వాస్తవమేమిటో ప్రజలకు తెలుసునన్నారు.

భువనేశ్వరి మాటలు విడ్డూరం

చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మాటలు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. ఎన్టీఆర్‌పై చంద్రబాబు చెప్పులేయిస్తే అప్పుడు ఎందుకు మాట్లాడలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తండ్రిపై చెప్పులేసినా తన భర్తకు సీఎం పదవి వస్తుందని మిన్నకుండిపోయారని చెప్పారు. స్కిల్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్ట్ చేసి జైల్లో పెడితే ఈ నాటకాలేమిటని ప్రశ్నించారు. తప్పెవరు చేసినా శిక్షను అనుభవించాల్సిందేనని.. తప్పు చేయడంతోనే ఆయన జైలుకెళ్లారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా డ్రామాలను ఆపాలని హితవు పలికారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్‌లు నల్లావుల శ్రీనివాసులు, పెనాక అనూష, సొసైటీ చైర్మన్ దేవనబోయిన శివకుమార్, ఎంపీటీసీ రాజమ్మ, నేతలు కళాకృష్ణ, పెనాక సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలో సముచిత స్థానం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరానికి చెందిన నవ నిర్మాణ సేన వ్యవస్థాపకుడు, జాతీయ బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు రాము వారి మిత్రబృందం దాదాపు 300 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. నర్తకి సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీసీ ఉద్యమాల్లో పాల్గొని.. సేవా కార్యక్రమాలను నిర్వహించిన రాము లాంటి మంచి వ్యక్తులు తమ పార్టీలో చేరడం శుభపరిణామమని చెప్పారు. 2021లో నిర్వహించిన కార్పొరేషన్ ఎన్నికల్లో నారాయణ తమకు డబ్బులు పంపగా, దాన్ని వెనక్కి పంపామని, ఈ విషయమై అనేక సార్లు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరినా ఇప్పటి వరకు సమాధానం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరాన్ని అభివృద్ధి చేశామని నారాయణ గొప్పలు చెప్పుకొంటున్నారని, అయితే అప్పులు తీసుకొచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో సర్వేపల్లి కాలువ, పెన్నా ఒడ్డున రిటైనింగ్ వాల్ పనులతో పాటు హరనాథపురం సెంటర్‌లో ఫ్లయ్‌ఓవర్‌ను నిర్మించామని తెలిపారు. ప్రజాశీస్సులతో 2024లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందుతానని చెప్పారు. ఊటా రాజశేఖర్‌యాదవ్, తాళ్లూరు రవి, రేష్మా, ధర్మేంద్ర, మదన్, సుమన్, రంజిత్, కిషోర్, కొండారెడ్డి, విజయ్, తదితరులు పార్టీలో చేరారు. సిద్ధవరం యానాదయ్య, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేలూరు మహేష్, సూరిశెట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



నెల్లూరు సిటీ: గుండెపోటుకు గురైన సమయాల్లో అత్యవసర చికిత్స సీపీఆర్‌ను ఎలా చేయాలనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ఏసీ ఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనస్థీషియా విభాగ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్థీషియా హెచ్‌ఓడీ శ్రీనివాసరావు మాట్లాడారు. అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ఛాతిపై ఒత్తిడి ఇవ్వడం ద్వారా మెదడుకు రక్త ప్రసరణ జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం హృద్రోగ వ్యాధులు అధికంగా వస్తున్నాయని.. తగిన ఆహారం, నిద్ర, వ్యాయామాన్ని తప్పక చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ వసుంధర, హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ ప్రొఫెసర్లు జమున, శాంతి, కో ఆర్డినేటర్ డాక్టర్ సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్లు సుబ్బారావు, ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజశేఖర్, శారద పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

వరికుంటపాడు: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని విరువూరు పంచాయతీ పాపన్నగారిపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన రాచపూడి రవి (26)కి చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లెకు చెందిన భారతితో పదేళ్ల క్రితం వివాహమైంది. మనస్పర్థలతో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని చెన్నైలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు పది రోజుల క్రితం వెళ్లారు. దీంతో రవి మరుసటి రోజు భార్య ఇంటికెళ్లొచ్చారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు శనివారం రాత్రి పాల్పడ్డారు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించారు. ఉరేసుకొని మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఉదయగిరి సీఐ గిరిబాబు సందర్శించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదాల కట్టడికి గానూ ఫేస్ వాష్ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంబడి రాత్రి వేళ వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించి.. డ్రైవింగ్‌లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నామని తెలిపారు. ఏడు హైవే మొబైల్స్‌తో నిరంతర గస్తీని నిర్వహిస్తూ జాతీయ రహదారులపై వాహనాలు నిలపకుండా చూడటంతో పాటు నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 100, 112కు సమాచారం అందించాలని కోరారు.

2న మెగా జాబ్ మేళా

ఆత్మకూరు: నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళాను నవంబర్ రెండున ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని రెండు వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పట్టణంలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 40కిపైగా కంపెనీలు హాజరుకానున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్, నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లో గోపవరం వద్ద త్వరలో ప్రారంభించనున్న సెంచూరియన్ ప్లయ్‌ఉడ్ యాజమాన్యంతో మాట్లాడామని, ఆత్మకూరుకు చెందిన 500 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రతినిధుల ద్వారా అంగీకారం పొందామని చెప్పారు.

సాహితీ కుసుమాలు పుస్తకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): కవి, రచయిత కోట శ్రీరామ్మూర్తి రచించిన సాహితీ కుసుమాలు పుస్తకాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సోమవారం ఆవిష్కరించారు. పద్యసారస్వత పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, పోలవరపు లక్ష్మీనరసింహరావు, వెంకటేశ్వరరావు, అగస్త్యరాజు సుబ్బారావు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 27వ డివిజన్ పరిధిలోని కొండాయపాళెం గేట్ సమీపంలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనను సోమవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నాలుగున్నరేళ్లలో డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో రూ.4.5 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని వెల్లడించారు. మరో రూ.కోటి మంజూరుకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని వివరించారు. సీఎం అమలు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. అవినీతికి ఏ మాత్రం తావు లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకే చేరుస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతున్నానని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి వెంకటసుబ్బారెడ్డి, నేతలు స్వర్ణా వెంకయ్య, హరిబాబుయాదవ్, ఏసునాయుడు, మద్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, పాలకీర్తి రవి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ

నెల్లూరు(బారకాసు): బాల్య వివాహాలు అనర్థాలకు దారి తీస్తాయని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. బాల్య వివాహాలపై ప్రజలను చైతన్యపరుస్తూ వీఆర్సీ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు పొదుపు మహిళలతో అవగాహన ర్యాలీని మెప్మా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా.. చేసినా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ప్రతి సంఘ సమావేశంలో అజెండాగా పెట్టి బాల్య వివాహాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు భవాని, సుహాసిని, శాంతి, హైమావతి, సాధన, సీఎంఎంలు పెంచలయ్య, కాంతయ్య, టీటీఐబీ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.117
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.210
స్కిన్‌లెస్ చికెన్	: రూ.230
లేయర్ చికెన్	: రూ.200

ఓ వర్గం గుప్పెట్లో జనసేన



మాట్లాడుతున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆయన కనుసన్నల్లో లేదని.. ఓ వర్గం గుప్పెట్లో నడుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. జనసేన పార్టీలో ఐదేళ్ల పాటు ఎన్నో అవమానాలు, అన్యాయాలకు తాను గురయ్యానని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనలతో పార్టీలో తాను చేరానని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇచ్చిన సూచనలు ఎంతో సంతోషాన్నిచ్చాయని వివరించారు. నగరంలోని 28 డివిజన్లలో తాను తిరిగానని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తనను కలిసేందుకు మాజీ మంత్రి నారాయణ మూడు రోజుల పాటు తిరిగారని, ఎంత డబ్బు కావాలన్నా ఇస్తామని.. జనసేనలోనే కొనసాగాలని కోరారర్నారు. పవన్ కల్యాణ్ కోసం తపనపడే వారిని తరిమేయాలని నాదెండ్ల మనోహర్ చూస్తున్నారని ఆరోపించారు. పదవి లేకుండా ఆయన ఒక్క రోజూ ఉండలేరని.. బ్రోకర్లు, డబ్బులిచ్చేవారికి అగ్రతాంబూలమిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ నుంచి తనను వెళ్లిపోవాలని ఆయన చెప్పారన్నారు. జనసేనకు వచ్చే పార్టీ ఫండ్‌కు అసలు జమ ఖర్చు లేదని.. నాదెండ్ల తన ఇష్టానుసారం ఈ నిధులను ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో నారాయణ అక్రమాలపై తీవ్రంగా పోరాడిన అంశాన్ని గుర్తుచేశారు. రూ.1150 కోట్ల హడ్కో రుణాన్ని నగర ప్రజలపై ఆయన రుద్దారని, ఇప్పటికీ నెలకు రూ.110 కోట్లను వడ్డీ రూపంలో ప్రజలు చెల్లిస్తున్నారని చెప్పారు. గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్రలో అనేక మంది జనసేన నేతలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీ దౌర్జన్యకాండపై పోలీసుల విచారణ

కావలి: మండలంలోని ముసునూరులో స్థల వివాద నేపథ్యంలో ఐటీ ఉద్యోగులైన అక్కాచెల్లెళ్లపై టీడీపీ నేతలు సాగించిన దౌర్జన్యంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టీడీపీ నేత చిట్టాబత్తిన మాల్యాద్రి అలియాస్ ఎర్ర మాల్యాద్రి, పొన్నగంటి అనిల్‌కుమార్ కలిసి సాదినేని ప్రియాంక, చందనపై దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వీరు ముసునూరుకు శనివారం వచ్చారు. వీరితో స్థల వివాదం ఉన్న పొన్నగంటి అనిల్‌కుమార్ స్థానిక టీడీపీ నేత చిట్టాబత్తిన మాల్యాద్రిని ఆశ్రయించి సెటిల్‌మెంట్ కుదుర్చుకున్నారు. దీంతో ఇద్దరూ కలిసి దాడికి పాల్పడి ముళ్లచెట్లలోకి తోసేశారు. గాయపడిన మహిళలు నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. దాడి ఘటనను బాధిత మహిళ ఒకరు సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. అయితే నిందితులు సదరు ఫోన్‌ను లాక్కొని మాయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా కేసును రాజీ చేసేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాలెపాటి సుబ్బానాయుడు, బొట్లగుంట శ్రీహరినాయుడు యత్నిస్తున్నారని సమాచారం.